



అంతర్వేదిలో వైభవంగా ప్రారంభమైన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు



రథాన్ని రాజావారి వీధికి లాగుతున్న భక్తులు

నరసన్న పెండ్లి కొడుకాయెనే...



ఆర్తజన రక్షకుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీవారికి వైఖానస ఆగమానుసారం వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు జరిగాయి. ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి ఆలయ అధికారులు, ట్రస్టు బోర్డు సభ్యులు, సేవా కమిటీ సభ్యులు, అగ్నికుల క్షత్రియులు పూలమాలలు వేశారు. అనంతరం స్వామి వారి నూతన రథానికి పూజలు నిర్వహించారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని మెరక వీధి (రాజా వారి వీధి)కి చేర్చారు. శ్రీకర, శుభకర, ప్రణవ స్వరూపుడైన ఆదిదేవుడు శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని పెండ్లి కొడుకుగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా తీర్చిదిద్దారు. స్వామివారు ఉదయం సూర్య వాహనంపై, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు.... 7లో



కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్



రబీలో సాగునీటి ఎద్దడి తలెత్తకుండా

చర్యలు తీసుకోవాలి

జలవనరుల శాఖ అధికారులకు జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్ ఆదేశం

అమలాపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటకాల్వల పూడికతీతలకు ప్రాధాన్యమిస్తూ వారాబందీ విధానంలో రబీలో సాగునీటి ఎద్దడి ఉత్పన్నం కాకుండా జలవనరులశాఖ ఇంజనీర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని జేసీ అధ్యక్షతన నిర్వహించారు. డెల్టా రైతులు పలువురు మాట్లాడుతూ పంట కాల్వలు, డ్రైనేజీల్లో పూడికతీత చేపట్టి తమను ఆదుకోవాలని కోరారు. ముంపు కారణంగా ఖరీఫ్ పంట నష్టపోతున్నామన్నారు. గత నెలలో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మినిట్స్‌పై తీసుకున్న చర్యలను జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు సభ్యులకు వివరించారు. రబీలో 1,68,925 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా ఇప్పటివరకు 97 శాతం ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయిందని, ఈ-కేవైసీ ప్రక్రియను 65 శాతం పూర్తి చేశామన్నారు. నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్ మాట్లాడుతూ భట్నవిల్లిలో పూడుకుపోయిన పంట కాల్వను సర్వే చేయించి భూ రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి అనుగుణంగా పూడిక తీయించాలని జలవనరుల శాఖ డీఈ శ్రీనివాసరావును ఆదేశించారు.మిచౌంగ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పించడంతో పాటు ఇన్సూరెన్సు కూడా అందేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయసాగు పనుల సమయంలో ఉపాధి హామీ పనులు తక్కువ స్థాయిలో చేపట్టి రైతుల అవసరాలను తీర్చాలని డ్వామా పీడీ ఎస్.మధుసూదన్‌ను ఆదేశించారు. పంటకాల్వలు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. వారాబందీ విధానంతో పాటు క్రాస్‌బండ్లు ఏర్పాటు చేయడం ద్వారా రబీలో సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు రమేష్, జె.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకట్రావు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం-మెర్లపాలెం రీచ్‌లో ఇసుక తవ్వకాలు

మైనింగ్ చట్టాలకు తూట్లు

- ఇసుక రీచ్‌లకు ఇష్టారాజ్యంగా అనుమతులు
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న అధికారులు
- తూతూమంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ

ఆత్రేయపురం, ఫిబ్రవరి 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఇసుక రీచ్‌లకు అనుమతులు మంజూరు చేయడంలో నిబంధనలకు నీళ్లొదిలి జిల్లా స్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా అధికార పార్టీకి తలొగ్గి మైనింగ్ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నెల 7వ తేదీన కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో జిల్లా ఇసుక కమిటీ సమావేశమై 11 రీచ్‌లకు అనుమతులు ఇచ్చేందుకు ప్రతిపాదనలు తయారు చేసి ఆమోదించింది. ఆయా రీచ్‌లకు ఇ-టెండరు ద్వారా అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ముందుగా ఆయా రీచ్‌ల వద్ద రెవెన్యూ యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాల్సి ఉంది. కొంతకాలంగా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్న ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి మరలా తిరిగి అప్పగించేందుకు మొక్కుబడి తతంగం చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక రీచ్‌ల మంజూరులో క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే టెండర్లు పిలిచేందుకు ప్రతిపాదనలు ఆమోదించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఈ నెల 12వ తేదీన జిల్లా ఇసుక కమిటీ కోనసీమలోని అంకంపాలెం, వద్దిపర్రు, ఇసుక రీచ్‌లను రహస్యంగా పరిశీలించడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఆయా రీచ్‌ల వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని ప్రకటించారు. దీనికి సంబంధించి తూతూమంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడంతో పాటు కలెక్టర్ ఆధ్వర్యంలో ఇసుక కమిటీ గోప్యంగా రీచ్‌లను పరిశీలించి వెళ్లిన అంశంపై ప్రజాప్రతినిధులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆత్రేయపురం మండలం అంకంపాలెం ఇసుక రీచ్‌లో ఇసుక ర్యాంపులో గరుక ఇసుక అందుబాటులో ఉన్నప్పటికీ 25 ఎకరాల విస్తీర్ణంలో 9.85 హెక్టార్లు ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. అయితే రావులపాలెం మండలం ఊబలంక ఇసుక రీచ్‌లో గరుక ఇసుక అందుబాటులో లేనప్పటికీ ఊబలంక-ఎ రీచ్ పేరుతో 46.86 హెక్టార్లు, ఊబలంక-బి రీచ్ పేరుతో 21.98 హెక్టార్లలో ఇసుక తవ్వకాలకు ప్రతిపాదించారు. అయితే ఊబలంక రీచ్‌లో తగినంత విస్తీర్ణంలో గరుక ఇసుక లేకపోయినప్పటికీ సుమారు 160 ఎకరాల్లో ఇసుక తవ్వకాలు జరిపేందుకు రెండు ఇసుక రీచ్‌లకు ప్రతిపాదనలు పంపడం ఎంతవరకు సమంజసమని ప్రతిపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మైనింగ్, కన్జర్వేన్సీ పర్యావరణ నిబంధనలు పాటించకుండా ఊబలంకలో రెండు ఇసుక రీచ్‌లకు ప్రతిపాదనలు పంపించడం... పక్కనే ఉన్న మెర్లపాలెం సరిహద్దులో ఇసుక అక్రమ తవ్వకాలు నిర్వహించడం తద్వారా ఇసుక ముసుగులో బొండుమట్టి తరలించడం ద్వారా అక్రమార్కులకు జిల్లా ఇసుక కమిటీ రాచబాట వేస్తోందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించి స్టేట్ ఇంపాక్ట్ ఎన్విరాల్, ఎంపవర్‌మెంట్ అథారిటీ దృష్టికి కొంతమంది ప్రజాప్రతినిధులు జరుగుతున్న నష్టాలను తీసుకెళ్లారు.



వెలిచేరు-ఎ, వెలిచేరు-బి, వద్దిపర్రు-ఎ, వద్దిపర్రు-బి, కపిలేశ్వరపురం, ఊబలంక-ఎ, ఊబలంక-బి, పొడగట్లపల్లి-ఎ, పొడగట్లపల్లి-బి రీచ్‌ల్లో గరుక ఇసుక అందుబాటులో ఉందో, లేదో అని పరిశీలించి రెవెన్యూ యంత్రాంగం బహిరంగంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాల్సి ఉంది, అయితే కేవలం కాగితాల్లోనే మొక్కుబడిగా ప్రజాభిప్రాయ సేకరణ చేసి నివేదికలు పంపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లా ఇసుక కమిటీ మంజూరు చేసిన 11 రీచ్‌లకు ఇ-టెండర్ల నిర్వహణకు ప్రజాభిప్రాయ సేకరణ రహస్యంగా నిర్వహించాల్సిన అవసరం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ పర్యావరణాన్ని ఛిద్రం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు నిర్వహించిందని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న తరుణంలో మరలా తిరిగి ఈ కంపెనీకే ఇసుక రీచ్‌లు అప్పగించేందుకు మొక్కుబడిగా ఈ తంతు కొనసాగిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పలు రీచ్‌ల్లో ఇసుక ముసుగులో బొండు మట్టిని తరలించి అధికార నేతలు కోట్లకు పడగలెత్తారు. ఇలాంటి పరిస్థితుల్లో అక్రమ ఇసుక, బొండు తవ్వకాలను ఎలా నిరోధిస్తారో వేచి చూడాల్సిందే.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా

సమగ్ర కార్యాచరణ

అమలాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తొలుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన అధికారులనుద్దేశించి మాట్లాడుతూ రీ సర్వే మూడో దశ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువు నాటికి పూర్తిచేసి హక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ ద్వారా పనులు కోరుతున్న వేతన జీవులకు కార్యాచరణ ప్రణాళిక ద్వారా పనులు కేటాయించి సరాసరి వేతనాలు, పనిదినాలు కల్పించాలన్నారు. పూడికతీత పనులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, సీపీవో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.చంటిబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర ప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది కల్యాణోత్సవాలకు 40 ప్రత్యేక బస్సులు



అమలాపురం రూరల్, ఫిబ్రవరి 16: దక్షిణ కాశీగా పేరొందిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ అమలాపురం డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు మేనేజరు సీహెచ్‌ఎస్ఎన్ మూర్తి తెలిపారు.స్వామివారి కల్యాణం, రథోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 19వ తేదీ ఉదయం నుంచి 20వ తేదీ రాత్రి రథోత్సవం ముగిసే వరకు అమలాపురం డిపో నుంచి 40 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు తెలిపారు. అమలాపురం-అంతర్వేది, అప్పనపల్లి-అంతర్వేది, పల్లం-అంతర్వేది రూట్లలో బస్సులు తిరుగుతాయని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

వాడపల్లిలో వేడుకగా రథసప్తమి

ఆత్రేయపురం, ఫిబ్రవరి 16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమిని ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం సూర్యనమస్కారాలు చేశారు. స్వామివారు సూర్యప్రభ వాహనంపై తిరువీధుల్లో ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,90,126 లభించినట్టు ఈవో తెలిపారు. వాహన సేవలో ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో బి.కిషోర్ కుమార్, మన్యం భాను, ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాస్, శ్రీదేవి పాల్గొన్నారు.

కొవిడ్ సాయం స్వాహాపై ఏసీబీ విచారణ

- వివరాలు 7లో

- వైభవంగా ప్రారంభమైన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు
- రథసప్తమి పర్వదినాన సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం
- అడుగడుగునా భక్తుల నీరాజనాలు
- ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాగతం


ముద్రికాలంకరణ చేస్తున్న పండితులు

అంతర్వేది లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవాలు ప్రారంభం

ఆర్తజన రక్షకుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రథసప్తమి రోజున వార్షికంగా బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు తొలి పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. ఆలయ స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు సమక్షంలో ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారికి వైఖానస ఆగమానుసారం, వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. తిరువారాధన, బాలభోగం, పంచామృత అభిషేకాలు జరిగాయి. బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నసమారాధన చేశారు.


చంద్రప్రభ వాహనంపై స్వామివారు


రథాన్ని లాగుతున్న భక్తులు

అంతర్వేది, ఫిబ్రవరి 16:

కల్యాణోత్సవాలకు శ్రీకారం

శ్రీకర, శుభకర, ప్రణవ స్వరూపుడైన ఆది దేవుడు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని పెండ్లి కొడుకుగాను, అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను తీర్చిదిద్దే అపూర్వ ఘట్టానికి శుక్రవారం అంతర్వేది ఆలయం వేదికైంది. ఆచారం ప్రకారం కేశవదాసుపాలెం గ్రామానికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబాల సంయుక్త నిర్వహణలో సాయంత్రం 6.30 గంటలకు దూపసేవ అనంతరం ముద్రికాలంకరణ నిర్వహించారు. విశేష పూజలందుకున్న స్వామి, అమ్మవార్లను అర్చకులు పెళ్లికి సిద్ధం చేశారు. అర్చకులు వేదమంత్రోచ్ఛారణలతో నీల మేఘశ్యాముడైన స్వామివారికి బుగ్గన చుక్క పెట్టడంతో పెండ్లి కొడుకుగా దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు వార్షిక ఉంగరాలను సమర్పించారు. రెండు కుటుంబాల ఆడపడుచులు స్వామి, అమ్మవార్లకు హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఆలయ ఫ్యామిలీ ఫౌండర్, చైర్మన్ రాజా కలిదిండి కుమారరామ గోపాలరాజా బహదూర్, ఉండపల్లి, బెల్లంకొండ, ముప్పర్తి కుటుంబ సభ్యులు, కొపనాతి కృష్ణమ్మ కుటుంబ సభ్యులు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, మాజీ సర్పంచ్ వనమాలి మూలాస్వామి, కేఏస్ఎన్ రాజు, వలవల రాంబాబు, సర్పంచ్ కొండా జాన్ బాబు, ఎంపీటీసీ భైరా నాగరాజు, వాహనకారులు తదితరులు పాల్గొన్నారు.

తొలిపూజ

ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి ఆలయ చైర్మన్, అధికారులు, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు, అగ్నికుల క్షత్రియులు పూల మాలలు వేశారు. అనంతరం శ్రీ స్వామివారి రథానికి పూజలు చేశారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. పల్లిపాలెం గ్రామానికి చెందిన వాహనచోదకులు, గ్రామస్తులు, భక్తులు రథాన్ని మెరక వీధి (రాజావారి వీధి)కి చేర్చారు.

సూర్యప్రభ

తొలిరోజు శ్రీలక్ష్మీనరసింహుడు శృంగారవరప్పాడు వాస్తవ్యులు అడబాల వెంకన్న కుమారులచే నిర్మితమైన సూర్యవాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి వారు హారతులు ఇచ్చారు. రథ సప్తమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళా భక్తులు సూర్య నమస్కారాలు చేశారు.

చంద్రప్రభ

కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి, మోరిపోడు వాస్తవ్యులు ముప్పర్తి సుబ్బారావు కుటుంబ సభ్యులచే నిర్మితమైన చంద్రప్రభ వాహనంపై రాత్రి 8 గంటలకు స్వామివారు నృసింహ నామచరణాలు, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీప కాంతుల నడుమ పురవీధుల్లో ఊరేగారు. స్వామివారికి భక్తులు హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

నేడు గరుడ పుష్పక వాహనంపై

శనివారం సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారు గరుడ పుష్పకవాహనంపై ఊరేగుతారు. గరుడు వేదమూర్తి స్వామివారి వాహనం. నిత్యం స్వామివారిని సేవిస్తారు. భక్తుల మనోరథం నెరవేర్చడం కోసం శ్రీస్వామివారు తన హృదయమనే పుష్పంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తారు. దీనిని చాటిచెప్పేందుకే స్వామివారు పుష్పక వాహనం అధిరోహిస్తారు. రాత్రి 7 గంటలకు వాహన సేవ జరుగుతుంది.


కొబ్బరికాయ కొట్టి రథాన్ని ముందుకు కదిలిస్తున్న చైర్మన్, ఆలయ అధికారులు, వాహనకారులు

11 రోజుల పాటు

మహాకుంభాభిషేకం

జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఘనంగా ఏర్పాట్లు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జ్యోతుల నెహ్రూ, నవీన్ తదితరులు

జగ్గంపేట, ఫిబ్రవరి 16: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబికాసమేత మల్లికార్జున స్వామి దేవస్థానం నందు కోటి శివలింగాలతో నిర్వహించనున్న మహా కుంభాభిషేకానికి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఇర్రిపాక శివాలయం వద్ద కోటి మట్టి శివలింగాలతో మహాకుంభాభిషేక సమిత రుద్రాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. శృంగేరి పీఠాధిపతి ఆశీస్సులతో ఈ నెల 26 నుంచి మార్చి 7 వరకు 11 రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో యావన్మంది భక్తులు పాల్గొని పరమశివుడి కృపకు పాత్రులు కావాలని కోరారు. భక్తులందరూ ఈ కోటి పార్థివ శివలింగాలను తమ స్వహస్తాలతో అభిషేకించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు సాయితేజ, పోతుల మోహన్‌రావు, చదరం చంటిబాబు, మంగ రైతు రామకృష్ణ, కందుల చిట్టిబాబు, తోటరవి, తోట గాంధీ, వీరంరెడ్డి కాశీబాబు, కొత్త కొండబాబు, అడబాల వెంకటేశ్వరరావు, కన్నబాబు, జాస్తి వసంత్, నీలం శ్రీను, ఉంగరాల రాము, పాఠంశెట్టి మురళీకృష్ణ, పైడిపాల సూరిబాబు, కందుల బాబ్జి, తూము కుమార్, అడబాల భాస్కరరావు, బదిరెడ్డి అచ్చన్నదొర పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవికి వెండి ఆభరణాలు


ఆభరణాల బహూకరణ

పిఠాపురం, ఫిబ్రవరి 16: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో ఉన్న రాజరాజేశ్వరీదేవికి దాతలు వెండి ఆభరణాలు బహూకరించారు. తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాలకు చెందిన డాక్టర్ కంచి చంద్రయ్య, డాక్టర్ నందినిరాణి దంపతులు సుమారు 6.50 లక్షలు విలువైన ఎనిమిదిన్నర కిలోల వెండితో వెండి చీర, వక్షస్థలం, కిరీటం, హస్తాలు, గణపతి సుబ్రహ్మణేశ్వరుడు, పీఠం తయారు చేయించారు. వాటిని శుక్రవారం అమ్మవారికి సమర్పించారు. ఆలయ అర్చకులు వాటిని అమ్మవారి ముందుంచి పూజలు నిర్వహించారు. దాతలను ఆలయ అధికారులు శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి, ఏసీ పులి నారాయణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరం రైల్వేస్టేషన్‌కు ఈట్‌రైట్ స్టేషన్‌గా గుర్తింపు



అన్నవరం, ఫిబ్రవరి 16: ప్రతినిత్యం వేలాదిమంది ప్రయాణికులకు అందుబాటులో సేవలందిస్తున్న అన్నవరం రైల్వే స్టేషన్‌కు ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈట్‌రైట్ సర్టిఫికెట్‌ను అందించినట్లు అన్నవరం రైల్వేస్టేషన్ మాస్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. విజయవాడ డివిజన్‌లో ఈ హోదా పొందిన స్టేషన్ అన్నవరం రైల్వేస్టేషన్ కావడం విశేషమని అన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో నాంపల్లి (హైద్రాబాద్) తర్వాత ఈ జోన్‌లో రెండో స్టేషన్‌గా గుర్తింపు పొందింది. స్టేషన్‌లో ఉన్న క్యాటరింగ్ స్టాల్స్‌లో ఆహార భద్రత, పరిశుభ్రత, విక్రేత వ్యక్తిగత శుభ్రత, ఫుడ్ గడువు తేదీల వ్యర్థాల తొలగింపు తదితర వాటిని పరిగణలోకి తీసుకుని ఈ గుర్తింపు పత్రం జారీ చేస్తారని సతీష్‌కుమార్ తెలిపారు.

గంజాయి స్వాధీనం

మైనర్‌తో సహా ముగ్గురి అరెస్టు

అనపర్తి, ఫిబ్రవరి 16 : గంజాయి పీల్చేందుకు ప్రత్యేకంగా గదిని అద్దెకు తీసుకుని గంజాయి మత్తులో జోగుతున్న బాలుడితో సహా ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు. మరో ఇద్దరు యువకులు పరారైనట్లు ఎస్‌ఐ తెలి పారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తిలోని పద్మశ్రీ థియేటర్ సమీపంలో పెంకుటిల్లును అద్దెకు తీసుకున్న కొందరు యువకులు గంజాయి మత్తులో జోగుతున్నట్లు వచ్చిన సమాచారంతో సీఐ శివగణేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గదిలో గంజాయి మత్తులో జోగుతున్న మైనర్ బాలుడి సహా కర్రి అజయ్ గోపాల కృష్ణారెడ్డి, దుప్పలపూడికి చెందిన తాతపూడి దివాకర్‌లు పట్టుబడగా దుప్పలపూడి గ్రామానికి వరపు సాయి, అనపర్తికి చెందిన పిల్లి కార్తీక్ పరారైనట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన వారి వద్ద నుంచి 1కిలో 127 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని గంజాయి సరఫరా చేసిన వారి వివరాలను సేకరించే పనిలో పడ్డామని అన్నారు. అనపర్తి, దుప్పలపూడి గ్రామాల్లో గంజాయి సేవించే యువత పెరిగినట్లు గుర్తించామని ఎవరినీ ఉపేక్షించేది లేదని అన్నారు. పట్టుబడ్డ నిందితులను కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సత్యదేవుడిని దర్శించుకున్న నటి హేమ

అన్నవరం, ఫిబ్రవరి 16: సత్యదేవుడి సన్నిధిలో సినీనటి హేమ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ పీఆర్వో దామెర కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందించగా ఆమెతో సెల్ఫీలు దిగేందుకు భక్తులు, ఉద్యోగులు ఆసక్తి కనబర్చారు.


సత్యదేవుడిని దర్శించుకున్న హేమ

నకిలీ నోట్లతో మోసం చేసిన వ్యక్తుల అరెస్టు


నిందితులతో పోలీసులు


నకిలీనోట్లు, కెమికల్ బాటిల్స్

అన్నవరం, ఫిబ్రవరి 16: నకిలీ నోట్లతో ఒకరిని మోసం చేసిన వ్యక్తులను అన్నవరం పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పిఠాపురానికి చెందిన అనుసూరి రాజబాబు వద్ద ఒక స్థలం అమ్ముతానని అదే గ్రామానికి చెందిన ఈటి జగదీష్ రూ.20 లక్షలు తీసుకున్నాడు. అయితే స్థలం విక్రయించకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా తాత్సారం చేస్తుండడంతో తీవ్ర ఒత్తిడి చేశారు. అయితే తన వద్ద డబ్బులు లేవని బ్లాక్‌మనీ ఉందని దానిపై కెమికల్స్ పూస్తే అసలైన నోట్లగా మారతాయని పేర్కొంటూ కొన్ని అసలు నోట్లపై నలుపు రంగు పూసి తర్వాత కెమికల్‌తో కడగడంతో అవి అసలు కరెన్సీగా కనిపించడంతో నమ్మి 5 నోట్లకట్టలు తీసుకున్నారు. తర్వాత మోసపోయినట్లు గ్రహించిన రాజబాబు మిగిలిన మొత్తంపై మరోసారి ఒత్తిడి చేయడంతో శుక్రవారం అన్నవరం వస్తే మిగిలిన నోట్లకట్టలు ఇస్తానని జగదీష్ తెలిపారు. దీంతో రాజబాబు పోలీసులకు ముందస్తు సమాచారమిచ్చారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో ప్రత్తిపాడు ఇన్‌చార్జి సీఐ ఎస్.లక్ష్మణరావు, అన్నవరం ఎస్‌ఐ కిశోర్ సిబ్బందితో జాతీయ రహదారిపై డిగ్రీ కళాశాల సమీపంలో వలపన్ని జగదీష్‌తో పాటు మరో ముగ్గురిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 15 నోట్ల కట్టలు, కెమికల్ బాటిల్స్, వారు వచ్చిన ఆటోను స్వాధీనం చేసుకుని ప్రత్తిపాడు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని ఎస్‌ఐ కిశోర్ తెలిపారు.

వైద్య రంగంలో సాంకేతిక నైపుణ్యంతో మెరుగైన ఫలితాలు


ముఖ్య అతిథిని సత్కరిస్తున్న గన్ని భాస్కరరావు తదితరులు

రాజానగరం, ఫిబ్రవరి 16: వైద్య రంగంలో సాంకేతిక నైపుణ్యంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని విశాఖపట్నంలోని ప్రభుత్వ రంగ సంస్థ ఆంధ్ర మెడికల్ టెక్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేంద్ర శర్మ అన్నారు. జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాల 16వ స్నాతకోత్సవం శుక్రవారం సాయంత్రం కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జితేంద్రశర్మ మాట్లాడుతూ ఒక నియమంగా పెట్టుకుని 100 మంది చొప్పున ఉచిత వైద్యం చేయాలని యువ డాక్టర్లకు ఆయన సూచించారు. శ్రీలంకలోని పెరడేనియా యూనివర్సిటీలో డెంటల్ విభాగం ప్రొఫెసర్లు జయసింఘే, అట్టిగళ మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు ప్రపంచ దేశాల మధ్య ప్రస్తుతం హద్దులు లేవన్నారు. దీనిలో భాగంగా 2018 బ్యాచ్ ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లకు ఈ కార్యక్రమంలో డిగ్రీలు ప్రదానం చేశారు. కళాశాల అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీహరిబాబు గ్రాడ్యుయేట్లతో మెడికల్ ఎథిక్స్‌పై ప్రమాణం చేయించారు. అనంతరం ముఖ్య అతిథి జితేంద్ర శర్మను జీఎస్‌ఎల్ వైద్య సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

98 శాతం ఉత్తీర్ణత...

జీఎస్‌ఎల్ మెడికల్ కళాశాల 2018 బ్యాచ్ ఎంబీబీఎస్ పార్ట్‌వన్‌లో 143 మందికి 140 మంది (98) శాతం ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్ తెలిపారు. 95 మంది 60శాతం కంటే ఎక్కువ, 25 మంది 75శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారన్నారు. 600లకు 595 మార్కులతో మేరీ శ్రీకళ ప్రథమ స్థానంలో నిలిచారు. ఇదే బ్యాచ్ పార్ట్-2లో 145 మందికి 139 మంది అనగా 95.86 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 76 మంది ఎక్కువ మార్కులతో ఫస్ట్‌క్లాస్ సాధించారన్నారు. 25 మంది 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. 600లకి 598 మార్కులతో కాండ్రేగుల వసంతలక్ష్మి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌ఎల్ సంస్థల చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు, మెడికల్ కళాశాల డైరెక్టర్లు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. .

4వ ఖేలో ఇండియా సమన్వయకర్తగా శ్యామ్‌కుమార్

జేఎన్టీయూకే,ఫిబ్రవరి 16: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ ఆధ్వర్యంలో అసోంలోని గువహటిలో ఈనెల 17 నుంచి 22వరకూ జరిగే 4వ ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ కబడ్డీ పోటీలకు సమన్వయకర్తగా డాక్టర్ జి.శ్యామ్‌కుమార్‌ను నియమిస్తూ న్యూఢిల్లీలోని ఏఐయూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పీఆర్వో, డీఏఏ సీహెచ్ సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు శ్యామ్‌కుమార్‌ను అభినందించిన అనంతరం మాట్లాడుతూ గత ఏడాది 3వ ఖేలో ఇండియా గేమ్స్‌కు సమన్వయకర్తగా శ్యామ్ కుమార్ వ్యవహరించారన్నారు. ఖేలో ఇండియా సౌత్‌జోన్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్యామ్‌కుమార్‌ను రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, సీఈ శ్రీనివాసులు, మాలోతు రమేష్ అభినందించారు.


నాటిక పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నాటిక పోటీలు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 16: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో గ్రామంలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళావేదికపై మూడు రోజులు పాటు జరిగే ఈ పోటీలను నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి, వేదపండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గొల్లప్రోలు వైస్ ఎంపీపీ నేమాని ఆదివిష్ణు, తాటిపర్తి సర్పంచ్ కట్టా బుల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి వచ్చిన కళాకారులు మూడు రోజులు పాటు పలు నాటికలను ప్రదర్శించనున్నారు.

నూతన రథానికి పూజలు



అన్నవరం, ఫిబ్రవరి 16: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి కొండపై వివిధ పర్వదినాల్లో సేవలందించేందుకు నూతనంగా తయారుచేయించిన టేకు రథానికి శుక్రవారం ఉదయం పండితులు కొండదిగువ పంపా సత్రం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో రామచంద్రమోహన్ రథాన్ని ప్రారంభించారు. అయితే రథాన్ని కొండపైకి తీసుకెళ్లే సమయంలో స్పీడ్ బ్రేకర్ల వద్ద బోల్టులు తగులుకుని ఊడిపోవడంతో కొద్దిసేపు రథాన్ని నిలిపివేసి మరమ్మతులు చేయించిన అనంతరం కొండపైకి తీసుకెళ్లారు. అయితే ఈ ఆలస్యం కారణంగా శుభఘడియలు ముగియడంతో రథోత్సవం వాయిదా వేశారు. త్వరలో మరో మంచి ముహూర్తంలో రథోత్సవం చేపట్టనున్నట్లు పండితులు పేర్కొన్నారు.

పిల్లలతో పని చేయించారు



అనపర్తి, ఫిబ్రవరి 16: అనపర్తిలోని ద్వారంపూడి బుల్లెమ్మాయి బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం కూలీలుగా మారిపోయారు. పాఠశాలలో పలుగు, పారలు పట్టుకుని మట్టి తవ్వి మోస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. చదువుకోవాల్సిన విద్యార్థులకు ఇలా పని చెప్పడాన్ని పలువురు తప్పుబట్టారు.

కొవిడ్ సాయం స్వాహాపై ఏసీబీ విచారణ

కాట్రేనికోన, ఫిబ్రవరి 16: కొవిడ్ డెత్ ఎక్స్‌గ్రేషియా పంపిణీలో అవకతవకలపై ఏసీబీ విచారణ చేపట్టింది. ఇందులో అనేక వాస్తవాలు, అక్రమాలు వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామానికి చెందిన కొంకి సింహాద్రి 2021 మే 22న కొవిడ్‌తో కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందాడు. అతడి భార్య మంగాదేవి కొవిడ్ ఆర్థిక సహాయం కోసం అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసినా సొమ్ములు అందలేదు. చివరకు విసిగి వేసారిన మంగాదేవి సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకుంది. దీంతో అసలు విషయం బయట పడింది. కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం రికార్డుల ప్రకారం ఏడాది క్రితమే రూ.50వేలు ఎస్‌బీఐ ఖాతాకు జమ చేసినట్టు, కలెక్టర్ కార్యాలయంలోని హెచ్ సెక్షన్లో సంప్రదించాలని సమాచారం అందించారు. అయితే ఆ బ్యాంకు ఖాతా బినామీదిగా తేలింది. ఆ ఖాతా తనది కాదని, సొమ్మును కావాలని వేరే జిల్లాకు చెందినవారి బ్యాంకు ఖాతాకు బదలాయించారని బాధితురాలు మంగాదేవి లబోదిబోమంటోంది. ఈ వ్యవహారంపై ఆమె కాకినాడ డీఆర్వోతో పాటు హెచ్ సెక్షన్ సిబ్బందిని ఎన్నిసార్లు కలిసినా సరైన సమాధానం రాలేదు. సిబ్బంది చేతివాటంతో కలెక్టర్ కార్యాలయంలో కొవిడ్ ఫైలు మాయమైనట్టు తెలిసింది. దాంతో అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకోలేక, తనకు ఆర్థిక సాయం అందించలేక విచారణ పేరుతో వాస్తవాన్ని దాచిపెడుతూ కాలయాపన చేస్తున్నారని ఆమె వాపోయింది. తాజాగా మంగాదేవి సమాచారహక్కు చట్టం ద్వారా మరోసారి కలెక్టర్ కార్యాలయానికి లేఖ రాసింది. అసలు విషయం బయటపడడంతో కలెక్టర్ కృతికా శుక్లా కోనసీమ జిల్లా కలెక్టర్ ద్వారా కాట్రేనికోన తహసీల్దార్‌ను విచారణకు ఆదేశించారు. తహసీల్దార్ విచారణ జరిపి నివేదిక సమర్పించారు. ఇదే సమయంలో మంగాదేవి తన సొమ్ము కాజేశారని ఏసీబీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏసీబీ రాజమహేంద్రవరం డీఎస్పీ విచారణకు ఆదేశించడంతో సిబ్బంది తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఏసీబీ సిబ్బంది ఇటీవల నడవపల్లిలోని మంగాదేవి ఇంటికి వెళ్లి విచారించింది.



రాజమౌళిని కలిసిన మార్గాని

కడియం, ఫిబ్రవరి 16: ప్రముఖ సినీ దర్శకుడు రాజమౌళిని శుక్రవారం కడియపులంక వీర హనుమాన్ నర్సరీ రైతు, రాష్ట్ర టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ కలిశారు. యుఆర్ హోం మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాజమౌళి దంపతులతో కొద్దిసేపు మాట్లాడి మాల్ అధినేత గోపాలకృష్ణతో కలిసి ఆంథోరియం రెడ్ మొక్కను అందజేశారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన కడియం నర్సరీల సందర్శనకు కుటుంబ సభ్యులతో కలిసి వస్తానని రాజమౌళి ఈ సందర్భంగా వారికి తెలిపారు.

లింక్ పంపించి రూ.4 లక్షలకు బురిడీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): లింక్ దోపిడీ కేటుగాళ్ల వలలో పడి ఓ గృహిణి మోసపోయారు. ఆమె త్రీటౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌లో నివాసం ఉండే గెడ్డం దివ్య సురేఖకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఒక మెసేజ్ వచ్చింది. గవర్నమెంట్ ప్లాట్‌ఫాంతో వర్క్‌ఫ్రం హోం ఇస్తామని, ఇంటి దగ్గర నుంచే డబ్బులు సంపాదించుకోవచ్చని ఆ మెసేజ్ సారాంశం. దీంతో ఆ మెసేజ్‌కి సురేఖ జవాబు పంపారు. వాట్సాప్ ద్వారా అవతలి వాళ్లు ఈమెతో మాట్లాడి టెలిగ్రాంలో ఒక లింక్ పంపించారు. దానిలో ఉన్న వర్క్ చేసి బాధితురాలు వాళ్లకు పంపించారు. డబ్బులు చెల్లిస్తే ఇంకొంత వర్క్ ఇస్తామని మళ్లీ మెసేజ్ పెట్టారు. ఈ క్రమంలో సురేఖ దఫదఫాలుగా రూ.4,08,000 సదరు సైబర్ నేరగాళ్లకు పంపించారు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలంటే రూ.5లక్షలు చెల్లించాలని నేరగాళ్లు అంటున్నారని సురేఖ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు. లింక్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అపరిచితులు పంపించే లింక్‌లను క్లిక్ చేయవద్దని.. అనుమానం వస్తే పోలీసులను సంప్రదించాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

కొత్తపేట, ఫిబ్రవరి16: ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జేఏసీ మండల చైర్మన్ మోటూరి రామారావు డిమాండ్ చేశారు. కొత్తపేట తహసీల్దారు కార్యాలయం వద్ద ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ సహ చైర్మన్ వైసత్తిరాజు, కన్వీనర్ నల్లా వెంకటరామారావు, వైస్ చైర్మన్ కేపీసీహెచ్ సూర్యారావు, ఆచంట రామచంద్రప్రసాద్, ఏవీ సుబ్బారావు, వి.విజయకృష్ణ, జి.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

పి.గన్నవరం, ఫిబ్రవరి 16: టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి సత్యనారాయణ అన్నారు. లంకలగన్నవరంలో ఆయన పర్యటించి అనంతరం మాట్లాడారు. తొలుత గ్రామదేవత శ్రీమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుని అనంతరం పలుదేవాలయాలు, డొక్కా సీతమ్మ నివాసాన్ని సందర్శించారు. గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, పాటు పార్టీల ముఖ్యనాయకులను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జనసేన మండల అధ్యక్షుడు సాధ నాలశ్రీవెంకటసత్యనారాయణ, గ్రామశాఖ అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్య క్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కార్యదర్శులు మద్దా చంటిబాబు, వాసంశెట్టి కుమార్, నాయకులు సలాది బుచ్చిరాజు, యల్లమిల్లి చిట్టిబాబు, యడ్ల ఏసుబాస్కరావు, పసలపూడి రామకృష్ణ, పెనుమాల లక్ష్మి, అడ్డగళ్ల సిరిజ్యోతి, పెంట ఏసమ్మ పాల్గొన్నారు.

'రాజధాని ఫైల్స్' అడ్డుకోవడం సిగ్గుచేటు

మండపేట, ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ సినిమా సీఎం జగన్‌రెడ్డికి కంటి మీద కునుకులేకుండా చేసిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎద్దేవా చేశారు. ఈసినిమా జగన్‌కు ఉన్న ఫైల్స్‌ను బయటకు తీస్తుందన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వేగుళ్ల విలేకరులతో మాటాడారు. సీఎం రాజధాని ఫైల్స్ సినిమాను అడ్డుకోవటం సిగ్గుచేటన్నారు.అమరావతి రైతుల వ్యథ, త్యాగాలను చిత్రరూపంలోతీస్తే జగన్‌కు ఎందుకు బాధని ప్రశ్నించారు. రాజధానిఫైల్స్ థియేటర్లలో ఆడకుండా అడ్డుకుంటే సహించేదిలేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, జొన్నపల్లి సూర్యారావు పాల్గొన్నారు.

మామిడికుదురు: రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వ కుట్రలు బట్టబయలు అయ్యాయని జడ్పీ మాజీ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గ టూమెన్ కమిటీ నామన రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాజధాని విషయంలో జగన్ చేసిన విష ప్రచారం సినిమాలో కళ్లకు కట్టినట్టు చూపించారని, ఒక నిరంకుశ పాలకుడి కుట్రలో ప్రజా రాజధాని ఎలా విధ్వంసమైందో కళ్లకు కట్టినట్టు చూపించి అందరికీ తెలిసేలా చేశారన్నారు.

పి.గన్నవరం: రాజధాని ఫైల్స్ సినిమాను అడ్డు కోవడం అప్రజాస్వామికమని, చివరకు న్యాయమే గెలిచిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు విమ ర్శించారు. లంకలగన్నవరంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సెన్సార్‌బోర్డు సర్టిఫికెట్ ఇస్తే ప్రభుత్వం సినిమాను అడ్డుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిబుద్ధి చెబుతారన్నారు.

అంతర్వేది: రాజధాని చిత్ర ప్రదర్శనను అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. రాజధాని ఫైల్స్ చిత్రాన్ని ప్రదర్శిస్తున్న థియేటర్లపై దాడులు చేసి సినిమా ప్రదర్శనను అడ్డుకోవడం వంటి చర్యలు ఈ ప్రభుత్వ హయాంలోనే జరుగుతున్నాయన్నారు. 29వేల మంది రైతులు, 34వేలఎకరాల భూమిని రాజధాని కోసం ఇస్తే వైసీపీ ప్రభుత్వం భావి తరాల భవిష్యత్తును సైతం నాశనం చేసిందన్నారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు

కొత్తపేట, ఫిబ్రవరి 16: ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు పునాది అని ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం శతాబ్ది డిగ్రీ కళాశాలలో ఓటు నమోదు, వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దారు ఎలీషా, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్, ఆర్ఐ కె.ఏడుకొండలు, వీఆర్వో వీరేంద్ర, ప్రిన్సిపల్ కె.నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడు అరెస్ట్

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 16: ఈనెల13న బస్సులో బాలికను ప్రేమించడంలేదని వేధించిన కేసులో టేకి గ్రామానికి చెందిన చొప్పలరవి కుమార్(నాని)కు శుక్రవారం ఆలమూరు కోర్టు రిమాండ్ విధించిందని అంగర ఎస్ఐ ఎ.పరదేశి తెలిపారు.

మద్యం, నగదు తరలింపు నిఘా

యానాం, ఫిబ్రవరి 16: ఎన్నికల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో మద్యం, డబ్బు, పెట్రోలు కదలికలపై ఇరుప్రాంతాల అధికారులు సమీక్ష నిర్వహించారు. కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఎస్పీ ఎస్.శ్రీధర్, యానాం పరిపాలనాధికారి మునిస్వామి, కార్యాలయ సూపరింటెండెంట్ పెనసల ఓనామ్మశివాయలు హాజరయ్యారు. ఎన్నికల సమయంలో మద్యం, పెట్రోలు, డబ్బు తరలింపుపై చర్చించారు.

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపండి

టీడీపీ ఎస్సీ సెల్ సమావేశంలో నేతలు పిలుపు

కాట్రేనికోన, ఫిబ్రవరి 16: టీడీపీ, జనసేన పార్టీల మండల ఎస్సీ సెల్ సమావేశం కాట్రేనికోనలో టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జొన్నాడ రాజారావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, జనసేన ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ హాజరయ్యారు. సమావేశంలో హరీష్‌మాధుర్ మాట్లాడుతూ సైకో ముఖ్యమంత్రి జగన్ మాయమాటలు చెప్పి దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, శిరోముండనాలు చేయిస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో దళితులంతా ఏకమై ముఖ్యమంత్రి జగన్‌ను గద్దె దింపాలని అన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్యే సుబ్బరాజు మాట్లాడుతూ సీఎం జగన్ దళితుల ఓట్లతో గెలిచి దళిత సంక్షేమ పథకాలు రద్దుచేసిన ఘనుడు జగనే అన్నారు. జనసేన ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ మాట్లాడుతూ తనకు టిక్కెట్ ఇస్తానని సీఎం జగన్ మోసగించారన్నారు. చెల్లి అశోక్ మాట్లాడుతూ వేల కోట్లతో అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటుచేసి దళితుల ఓట్లకు సీఎం జగన్ గాలం వేస్తున్నారని, ఇది దళితులు గమనించి జగన్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మోకా ఆనందసాగర్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నడింపల్లి సుబ్బరాజు, దాట్ల పృధ్వి, ఇసుకపట్ల



కాట్రేనికోనలో జరిగిన ఎస్సీ సెల్ సమావేశంలో పాల్గొన్న టీడీపీ జనసేన నాయకులు

వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, చెల్లి సురేష్, రంబాల రమేష్, చీకురుమెల్లి చక్రధర్, రంబాల దొరబాబు, సంసాని పాండురంగ, జనిపల్లి సోమన్న, వెంట్ర సుధీర్, మోకా బాలప్రసాద్, మాజీ సర్పంచ్ పండురాంజీ, మిమ్మితి చిరంజీవీ, గొల్లపల్లి గోపి, తాళ్లూరి ప్రసాద్, సరవపు వెంకట్, రంబాల రమేష్, మాదే యోగేశ్వరీ, రేవు రమేష్, మచ్చా నాగబాబు, పొద్దోకు నారాయణరావు(బాలు) భైరవస్వామి, సత్తాల ప్రసాద్, గెద్దాడ శ్రీను, లోవరాజు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కూటమిదే గెలుపు

అల్లవరం, ఫిబ్రవరి 16: రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి ఘన విజయం సాధిస్తుందని, జగన్‌ను ప్రజలు చిత్తుగా ఓడిస్తారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు.

కోడూరుపాడులో నడింపల్లి సుబ్బరాజు అధ్యక్షతన టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబరాజు ఆధ్వర్యంలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారంటీ'లో భాగంగా ఇంటింటా ప్రచారం చేశారు. రాష్ట్ర నాయకులు పెచ్చెట్టి చంద్రమౌళి, పెచ్చెట్టి విజయలక్ష్మి, కర్రి దత్తుడు, బొర్రా ఈశ్వరరావు, ఎస్.సుబ్బరాజు, వేగిరాజు సుబ్బరాజు, పంపిరెడ్డి కాశీ, తోట నరసింహరావు, పోతుల నాగరాజు, గెద్దాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు నాయకులకు పట్టవా

రావులపాలెం, ఫిబ్రవరి 16: గ్రామాల్లో అపారిశుద్యం తాండవిస్తున్నా వైసీపీ నాయకులకు పట్టదా అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రశ్నించారు. రావులపాలెంలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. రైతుబజార్ ప్రాంతంలోని ఎస్సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి టీడీపీ -జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టబోయే అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రైతుబజార్‌ను మోడ్రన్‌గా రైతు బజార్‌గా తీర్చిదిద్దామన్నారు. నాయకులు గుత్తుల పట్టాభిరామారావు, చిలువూరి సతీష్‌రాజు, కోనాల అంబేడ్కర్, నేకూరి ప్రసాద్, వడ్లమూడి రామారావు, వెలగల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ స్కాలర్‌షిప్‌నకు రత్నం ఎంపిక

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 16: అంగర శ్రీసిద్ధార్థ జూనియర్ కళాశాలలో 2023-24లో బైపీసీ చదివిని జిల్లెల్లపేటకు చెందిన విద్యార్థిని కాసుల మేరీరత్నం రిలయన్స్ ఫౌండేషన్ అండర్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైంది. ఉన్నతచదువుల కోసం రిలయన్స్‌ఫౌండేషన్ నుంచి రూ.2లక్షలు అందనున్నాయి. 5వేల మంది విద్యార్థులకు రిలయన్స్ సంస్థ స్కాలర్‌షిప్స్ మంజూరు చేసింది. ఇంటర్‌లో ఆమె 926మార్కులు సాధించింది. ఆమెను శ్రీసిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర, చైర్మన్ డాక్టర్ వి.శేఖర్, కరస్పాండెంట్ వి.రాజా అభినందించారు.

'ఆశ్చర్యకరమైన వైద్య విధానంగా యోగా'

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 16: భవిష్యత్‌లో ఆశ్చర్యకరమైన వైద్య విధానంగా యోగా పరిణమిస్తుందని హిమాలయ యోగి యష్ శేఖర్‌జీ పేర్కొన్నారు. రోగులకు ప్రత్యామ్నాయ చికిత్స, ధ్యానం, హీలింగ్ ప్రక్రియల ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరిచే విధానాలన వివరించారు. అమలాపురం విద్యుత్ నగర్‌లోని ఆదిశేషా నిలయంలో జరిగిన కార్యక్రమంలో శేఖర్‌జీ భక్తుల సందేహాలనునివృత్తి చేశారు. ఆధ్యాత్మికోన్నతికి సలహాలందించారు. శ్రీగౌతమ మహర్షి అక్షయపాత్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.3.20కోట్లతో రహదారి ఆధునికీకరణ

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 16: ఎస్డీఎంఎఫ్, నాబార్డు నిధులు రూ.3.20కోట్లతో 3.200కి.మీ.ఉప్పలగుప్తం-ఎస్.కొత్తపల్లి రహదారి ఆధునికీకరణ పనులకు మంత్రి పినిపే విశ్వరూప్ శుక్రవారం శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈఈ అన్యం రాంబాబు, సర్పంచ్‌లు కుంచే చిట్టికుమారిచిన్ని, కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, దంగేటి రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ, మాజీ సర్పంచ్ బొడ్డు నాగేశ్వరరావు (బుజ్జి) పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ మధ్యలోనే వెనుదిరిగిన మహిళలు



సమావేశం మధ్యలోనే వెనుదిరిగిన డ్వాక్రా మహిళలు

మామిడికుదురు, ఫిబ్రవరి 16: వైఎస్సార్ ఆసరా నాల్గో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం పాశర్లపూడిలో శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పార్టీ, సీఎం జగన్ గొప్పలు చెబుతున్న సమయంలో డ్వాక్రా మహిళలు సమావేశం మధ్యలోనే వెనుదిరిగారు. ముఖ్యఅతిథిగా జడ్పీ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ విప్పర్తి వేణుగోపాలరావు ప్రసంగించకుండానే మహిళలు వెనుదిరిగారు. దీంతో నాయకులు హడావిడిగా ముఖ్యఅతిథి విప్పర్తితో ప్రసంగాన్ని ప్రారంభింపచేశారు. సమావేశం నుంచి వెనుదిరుగుతున్న మహిళలను అడ్డుకోవడానికి యానిమేటర్లు ప్రయత్నం చేసినప్పటికీ మహిళలు వెనుతిరగడం గమనార్హం. ఎంపీపీ కుసుమ వనజాకుమారి, స్థానిక సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతినాగరాజు, సొసైటీ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్యకుమార్, యామీవీ సత్యనారాయణ, నాయకులు జక్కంపూడి వాసు, తోరం భాస్కర్, తులా గోపాలకృష్ణ, మహిళా సమాఖ్య ఏపీఎం డి.అజయ్, సీసీఎస్ ఆనంద్, అక్కౌంటెంట్ కె.నాగార్జున, సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ మోహినీదుర్గ, సెక్రటరీ బి.శాంతికుమారి, వీవోఏలు పాల్గొన్నారు.

రైతు సమస్యలు సీరియస్‌గా తీసుకోరెందుకు?

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 16: ప్రతి ఏటా సమస్యల పరిష్కారానికి హామీలిస్తున్న అధికారులు వాటిని విస్మరించడంతో రైతులు పండించిన పంటను దక్కించుకోలేకపోతున్నారని తెలుగు రైతు మండల అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన రైతుల సమస్యలను అధికారులకు గుర్తు చేస్తూ పరిష్కరించాలని అభ్యర్థించారు. తుఫాను వల్ల సార్వా నష్టాలను అంచనా వేసిన అధికారులు ఇప్పటివరకు నష్టపరిహారం అందించకపోవడం అన్యాయమన్నారు. ఉత్తర పీకాలేరులో పూడిక తీశారే తప్ప దానివల్ల ప్రయోజనంఉండదన్న విషయాన్ని అధికారులు గుర్తించలేదన్నారు. ముంపునీరు మేజర్ డ్రెయిన్‌లోకిపోవాలంటే అడ్డకోడు తవ్వాలని వివరించారు. అడ్డకోడుకు, కూనవరం డ్రెయిన్‌కు మధ్య కల్వర్టు ఏర్పాటు చేస్తామన్న



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగురైతు అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సూర్యనారాయణ

మంత్రి, అధికారుల హామీ నెరవేరలేదన్నారు. ఇన్ని సమస్యల మధ్య దాళ్వా నాట్లు సకాలంలో వేసుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం జేసీ నూపూర్‌అజయ్‌కు వినతిపత్రం సమర్పించారు. కోనసీమ రైతు పరిరక్షణసమితి ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు తదితరులుపాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలు

రావులపాలెం, ఫిబ్రవరి 16: కొమరాజులంకలోని సూర్యదేవాలయంలో రథసప్తమి నిర్వహించారు. ఈమని సీతారామమూర్తి కుమారులు సుబ్రహ్మణ్యభాస్కరశర్మ, సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో రథోత్సవం జరిపారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారికి కల్యాణం, పూజలుచేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

కపిలేశ్వరపురం: మండలంలో మహిళలు రథసప్తమి వేడుకలు జరుపుకున్నారు. మహిళలు వేకువజామునే స్నానమాచరించి కాయలు, ఆకులతో రథాన్ని ఏర్పాటు చేసుకుని సూర్యదేవునికి పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చి పసుపు కుంకుమలతో వర్థిల్లాలని ప్రార్థించారు.

వీఎస్ఎం విద్యార్థులకు ఉద్యోగాలు

రామచంద్రపురం, ఫిబ్రవరి 16: స్థానిక వీఎస్ఎం కళాశాలలో శుక్రవారంఎసిటీ ఫైబర్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కళాశాలకు చెందిన బి.భవానీ, వి.వర్షిణీ, డి.కృపాసాగర్‌లు సాఫ్ట్‌వేర్ ట్రైనీలుగా ఎంపికయ్యారని వైస్ ప్రెసిడెంట్ ఎం.ఎస్.ఎన్. మూర్తి తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడదాం

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జాతీయ కార్యదర్శి టాన్యా

మండపేట, ఫిబ్రవరి 16: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోన్న ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజలు, కార్మికులు తిప్పికొట్టాలని సీపీఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ పార్టీ జాతీయ కార్యదర్శి పి.టాన్యా పిలుపు నిచ్చారు. శుక్రవారం జరిగిన బంద్‌లో బాగంగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మిక ర్యాలీ, బహిరంగసభలో ఆమె ప్రసంగించారు. తొలుత పెద్ద కాల్వ వంతెన వద్ద నుంచి కలవపువ్వు సెంటరు వరకు రైస్ మిల్లు, జట్టు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండపేట ఏడిద రోడ్డులో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరిగిన కార్మిక సదస్సుకు ఐఎఫ్‌టీయూ, ఉమ్మడి జిల్లా కార్యదర్శి చీకట్ల వేంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్పొరేట్ సంస్థలు వ్యవసాయంపై పెట్టుబడులు పెట్టి రైతులను దోచుకుంటున్నాయని వేంకటేశ్వరరావు ఆరోపించారు. ఆలమూరు తాలుకా రైస్‌మిల్లు వర్కర్లు, జట్టు కార్మికులు, కార్మిక సంఘ నాయకులు, పీడీఎస్‌యూ సంఘ నాయకుడు బి.సిద్ధు, జట్టు కార్మిక యూనియన్ నాయకులు నల్లా శ్రీను, చల్లా శ్రీను, గంగరాజు, కంబాల సత్తిబాబు పాల్గొన్నారు.



మండపేట: కార్మిక సదస్సులో మాట్లాడుతున్న నాయకులు

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

రాయవరం, ఫిబ్రవరి 16: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మీ అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా నిరసన చేపట్టారు. కార్మికులందరికీ కనీస వేత నం రూ.26వేలు చెల్లించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, నిత్యావసర ధరలు తగ్గించాలన్నారు. తహశీల్దారు కిషన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీవర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు కృష్ణకుమారి, పద్మ, నూకరత్నం, వివిధ సంఘాల నేతలు మంగాదేవి, బేబి, వరలక్ష్మి, లీలావతి, పద్మ కార్యకర్తలు, ఆశవర్కర్లు, మధ్యాహ్న భోజనం కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసన

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 16: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్లు పరుస్తూ రైతులపై ముళ్ల బుల్లెట్ల వర్షం కురిపించడాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఎన్నికలకు ముందు బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించిందన్నారు. కేంద్ర, కార్మిక, సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపులో భాగంగా శుక్రవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురం శుభ కలశం సెంటరు నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. అత్యంత కీలకమైన రంగాలను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు అప్పగించేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ఆరోపించారు. రైతుల రుణాలు మాఫీచేయాలని, 4లేబర్ కోడ్లను రద్దు చేయాలని, రాష్ట్ర హక్కులు కాపాడాలంటూనినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా నాయకుడు పెద్దిరెడ్డి రాము, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిరాజు, యూనియన్ నాయకులు వి.గణపతి, చిరంజీవి, కె.రంగప్రసాద్, జి.దైవకృప, విజయ, తాడి శ్రీరామమూర్తి, ఊటాల వెంకటేష్, నిమ్మకాయల శ్రీనివాస్, మోకా శ్రీనివాసరావు, సీహెచ్ఎన్వీ కోటేశ్వరరావు, కుంపట్ల వరుణ్‌బాబు పాల్గొన్నారు.

ఐ హేట్ లవ్ సినిమా యూనిట్ సందడి

మండపేట, ఫిబ్రవరి16: ఐహేట్ లవ్ సినిమా యూనిట్ శుక్రవారం మండపేటలో సందడి చేసింది. కోనసీమ యాస ప్రాశలను చిత్రంలో చూపించటం అభినందనీయ మని జేవీవీ రాష్ట్రపూర్వ అధ్యక్షుడు చల్లా రవికుమార్ అన్నారు. స్థానిక కృష్ణా థియేటర్‌లో శుక్రవారం చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించింది. పిట్టలదొర ఫేమ్ కామెడి నటుడు శేఖర్, నటి సుంకరలక్ష్మీలకురవికుమార్ స్వాగతం పలికారు. కోనసీమ అందాలను తెరకెక్కించిన చిత్ర డైరెక్టర్ వెంకటేష్ ప్రతిభనుకొనియాడారు. అసిస్టెంట్ డైరెక్టర్ గండి ఆనందర్, జేవీవీ కోనసీమ కన్వీనర్ ఉద్దండపు గుణ జి.వి.సత్యనారాయణ, మీరాబి కట్‌పీసెస్ యజమాని నల్లమామిడి మీరాసాహెబ్, గోవిందరాజు, స్వామిప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి సాయం

యానాం, ఫిబ్రవరి 16:యానాంలో స్విమ్మింగ్‌పూల్ పడి ఇటీవల విద్యార్థి సాయిరోహిత్ మృతిచెందగా స్థానిక అగ్రహారంలోని శ్రీకృష్ణదేవరాయ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమకూర్చిన రూ.1.68లక్షల చెక్కును విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణప్రవీణ్ విద్యార్థి కుటుంబానికి అందజేశారు. హెచ్ఎం బేతాళం బాబ్జీ పాల్గొన్నారు.

కార్పెంటర్ల సమస్యలను పరిష్కరించాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 16: గృహ నిర్మాణ పరికరాలు రెడీమేడ్‌గా అందుబాటులోకి రావడంతో కార్పెంటర్లు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంఘ కార్యాలయంలో పాటివెంకట్రామయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. టింబర్ డిపోలోనే గుమ్మాలు, కిటికీలు తయారు చేయడం వల్ల కార్పెంటర్లకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. కార్పెంటర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందించేందుకు తీర్మానించారు. ఇసుకపై ఆంక్షలు తొలగించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దంగేటి రామకృష్ణ, నాయకులు జల్లి సత్యనారాయణ, గున్నేపల్లి భీమశంకరం, కుసుమ నరసింహరాజు, సాధనాల రామకృష్ణ, సంసానిబాలాజీ, వాసంశెట్టి గణేష్‌స్వామి, బొంతు లక్ష్మణరావు, దూనబోయిన వెంకటరమణ, మంకు శివ, కొనుకు వెంకటేశ్వరరావు, కొపనాతి గణపతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని పాలగుమ్మి మీదుగా ముక్కామల వరకు ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద రూ.4.30 కోట్లతో, ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.30లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ శుక్రవారం ప్రారంభించారు. నడిపూడి కుమ్మరి కాల్వ వద్ద రూ.1.45కోట్లతో నిర్మించిన హైలెవెల్ వంతెనను ప్రారంభించారు. పాలగుమ్మి ఫుట్‌పాత్ బ్రిడ్జి నుంచి కంభంపాడు వరకు ఎస్డీఎంఎఫ్ నిధులు రూ.2.40కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపనచేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇందుపల్లి నుంచి పేరూరు వరకు ఎస్డీఎంఎఫ్ నిధులు రూ.1.60కోట్లతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్‌అబ్దుల్‌ఖాదర్, కుడుపూడిబాబు, బొంతు గోవిందుశెట్టి, సరెళ్ల రామకృష్ణ, పంచాయతీరాజ్ డీఈ పీఎస్ రాజ్‌కుమార్, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, సర్పంచ్‌లు చొల్లంగి శివాళిని, కె.రామలక్ష్మి పాల్గొన్నారు.

నులిపురుగుల వల్లే రక్తహీనత

అంబాజీపేట, ఫిబ్రవరి 16: నులిపురుగులు వల్లే రక్తహీనతతో పాటు బలహీనంగా ఉంటారని జిల్లామానిటరింగ్ అధికారిఏ.సూర్యనగేష్ అన్నారు. ముక్కామల పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. సీహెచ్‌వో ఎం.రవికుమార్, హెచ్ఎం కనకదుర్గ పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటరమణ	: ఈగల్
శ్రీలలిత	: రాజధాని ఫైల్స్
శేఖర్ స్ర్కీన్-1	: హనుమాన్
శేఖర్ స్ర్కీన్-2	: ఐ హేట్ లవ్
రమా	: గుంటూరు కారం
గణపతి	: హాయ్ నాన్న
వెంకటపద్మావతిస్ర్కీన్-1	:ఊరుపేరు భైరవకోన
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: యాత్ర-2

టీడీపీ అధికారంలోకి రావాలని పాదయాత్ర



రావులపాలెం: పాదయాత్రను ప్రారంభిస్తున్న బండారు సత్యానందరావు

రావులపాలెం/ఆత్రేయపురం, ఫిబ్రవరి 16: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, బండారు సత్యానందరావు కొత్తపేట ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలుపొందడంతో పాటు టీడీపీ అధికారంలోకి రావాలని కోరుతూ పొడగట్లపల్లికి చెందిన ఆ పార్టీ బీసీ నాయకులు వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. దీనిని బండారు సత్యానందరావు జెండా ఊపి ప్రారంభించారు. నాయకులు వాడపల్లి చేరుకుని స్వామివారిని దర్శించుకుని బండారు, చంద్రబాబు గెలవాలని మొక్కులు తీర్చుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వానికి వెంకన్నాయుడు దరఖాస్తు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 16: కాంగ్రెస్ పార్టీ అమలాపురం పట్టణ అధ్యక్షుడు, పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ కన్వీనర్ వంటెద్దు వెంకన్నాయుడు(బాబి) ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేసులో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీకి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని పార్టీ ఎన్నికల కమిటీకి దరఖాస్తును అందించారు. ముమ్మిడివరం నియోజకవర్గ కన్వీనర్‌గా, పీసీసీ కార్యదర్శిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా జిల్లా వాణిజ్య విభాగం చైర్మన్‌గా పదవులు చేపట్టారు.

వీరభద్రస్వామి ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

మామిడికుదురు, ఫిబ్రవరి 16: పెదపట్నంలంకలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీభద్రకాళీ సమేత బాలవీరభద్రేస్వామి ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మాఘ శుద్ధ సప్తమి శుభ ముహూర్తంలో శిరిగినీడి గోపీనాథ్-హేమజ్యోతి దంపతులు కర్తలుగా పాల్గొని పూజలు చేశారు. గణతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, ప్రధాన మండపారాధన, అఖండ దీపారాధన, ధ్వజారోహణ వంటి కార్యక్రమాలు గంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా చేశారు. ఆదివారం ఉదయం 10.42 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 16: అర్హులందరికీ సీఎం జగన్ పట్టాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నగర పంచాయతీ 20వార్డుల్లో అర్హులైన 173మంది పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి, జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, ఎంపీపీ కోలా గంగాభవానీ, హితకారిణి సమాజ్ చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, నాయకులు పెన్మెత్స చిట్టిరాజు, వేటుకూరి బోసురాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జీ, జగతా బాబ్జీ, దొమ్మేటి అప్పారావు, రాయపురెడ్డి జానకిరామయ్య, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, నగర పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

25శాతం ఉచిత సీట్లు కల్పించాలి

రాజోలు, ఫిబ్రవరి 16: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో ఎన్.మనోహరం ఆధ్వర్యంలో మండలంలోని ఉన్న ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లకు (12 1సి) ప్రకారం పేద విద్యార్థులకు 25శాతం ఉచిత సీట్లపై సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసమావేశానికి జిల్లా డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంఈవో మనోహరం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం (12 1సి) ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం అడ్మిషన్లను కచ్చితంగా కల్పించాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్రైస్తవులపై దాడులు నశించాలని దళితుల నిరసన

రాజోలు, ఫిబ్రవరి 16: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దళిత క్రైస్తవులపై దాడులు నశించాలంటూ దళిత నాయకులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఎం.పాల్‌కు దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, వైఎస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం సంకర్పల్లి మండలం జవ్వాడ గ్రామంలో మెథడిస్ట్ చర్చిపై, దళిత క్రైస్తవులపై దాడిచేసిన దుండగులను శిక్షించాలని డిమాండు చేశారు. చిలకపాటి శ్రీధర్, తెన్నేటి బాబూరావు, జిల్లెల్ల వినోద్‌బాబు, కాకర విశ్వనాథం, బుడితి గోపాలకృష్ణ, మందపాటి మధు, గోగి మోహన్, దొండపాటి రవికుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 16: రథసప్తమి సందర్భంగా ముమ్మిడివరం హెల్దీ లైఫ్ ఇన్ యోగా సెంటర్‌లో శుక్రవారం సూర్య నమస్కారాలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య యోగాసనాలు వేసి అవగాహన కల్పించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, యోగాతో ప్రశాంత, ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చన్నారు. 12 భంగిమల్లో సూర్య నమస్కారాలు చేయడం ద్వారా అనేక రుగ్మతలు దూరం చేసుకుని మానసిక వికాసం పొందవచ్చునని కోచ్ వాసంశెట్టి నరేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, రాంబాబు, జాఫర్, లవకుమార్, వేణు, మణికంఠ, బాలు, త్రినాథ్‌లు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 16: తన మనుమవరాళ్లు శ్రీలక్ష్య, వ్యాఘ్రిల పుట్టినరోజు సందర్భంగా ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెన్మెత్స జగ్గప్పరాజు తెలిపారు. జీఎస్ఎల్, చింటూ, శరణ్య ఆసుపత్రులు ప్రముఖ వైద్యులు సేవలందిస్తారన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు, అల్ట్రాసౌండ్, మమోగ్రాఫీ, డిజిటల్ ఎక్సరే, ఆర్డీఎస్ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. కేన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, దంత సమస్యలు, కంటి వైద్యం, నరాలకు సంబంధించిన వ్యాధులకు సంబంధించి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తామన్నారు.

గోవింద మాలధారణ

ఆత్రేయపురం, ఫిబ్రవరి 16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గోవిందమాలధారులు ఖండవిల్లి సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. మాల ధరించిన స్వాములకు దీక్షా సామగ్రిని ఈవో కిషోర్‌కుమార్ అందజేశారు. వారికి 41రోజుల పాటు దేవస్థానం ఆధ్వర్యంలో వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నారు.

మహిళా అభ్యున్నతిపై శ్రద్ధ

కె.గంగవరం, ఫిబ్రవరి 16: మహిళాభ్యున్నతికి సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వైసీపీనియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. శుక్రవారం కె.గంగవరం ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయనమాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, లోక్‌సభ సభ్యురాలు చింతా అనురాధ వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించారు. 26గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలకు నాల్గోవిడతలో మంజూరైన రూ.10.94కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ పందు గోవిందరాజు, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, జడ్పీటీసీ ఓలిశెనేని శ్రీవరలక్ష్మి రాజ్‌కుమార్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్, వెలుగు ఏపీఎం ఏ.రఘురామ్, సర్పంచ్ కోటి లక్ష్మీనరసరమ్మ వెంకట్రావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సూర్యనమస్కారాలపై శిక్షణ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 16: రథసప్తమి పురస్కరించుకుని శుక్రవారం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ఖండప్రముఖ్ బి.వి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శర్మ, హనుమంతు, ఆళ్లబుజ్జి, పిల్లా వీరభద్రం తదితరులు 40విద్యార్థులు, పెద్దలకు సూర్యనమస్కారాల శిక్షణ నిర్వహించారు. ఈవో పి.టి.వి.సత్యనారాయణ ప్రశంసాపత్రాలు అందజేశారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

రామచంద్రపురం, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం రామచంద్రపురంలో సీఐటీయూ ఆధ్వర్యంలో న్యూ కోనసీమ డ్రైవర్సు క్లీనర్స్ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ సభ్యులు ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం మాట్లాడుతూ ఈ చట్టం అమలైతే డ్రైవర్‌కి రూ.10లక్షల జరిమానా, 10ఏళ్లశిక్షవిధిస్తారని, అంత సొమ్ము డ్రైవర్ వద్ద వుంటే డ్రైవర్ ఉద్యోగం చేయవలసిన అవసరంలేదన్నారు. ఈచట్టం అమలు చేస్తే రాబోయే కాలంలో డ్రైవర్ వృత్తిలోకి ఎవరూరారని అన్నారు. జిల్లా కార్యదర్శి శంకర్, ప్రెసిడెంట్ సతీష్, ప్రధాన కార్యదర్శి అయినవిల్లి నాగరాజు, కోశాధికారి షారూక్, యూనియన్ నాయకులు దొరబాబు, శ్రీను, అజయ్ పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేయడం సరికాదు

అంతర్వేది, ఫిబ్రవరి 16: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు శుక్రవారం విచ్చేశారు. స్వామివారి దర్శనం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా దుకాణాలకు సంబంధించిన పన్నులను గతంలో రద్దు చేశామని, మళ్లీ ప్రభుత్వం గతం స్థలానికి రూ.200చొప్పున వ్యాపారస్తుల నుంచి వసూలు చేయడం సరికాదని గొల్లపల్లి అన్నారు. అంతర్వేది పల్లిపాలెం గ్రామంలో నిర్మించిన మినీ ఫిషింగ్ హార్బరులో ఇటీవల ఒక ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, కమిటీ విధివిధానాలు వెంటనే మత్స్యకారులకు తెలియచేయాలని, ఆ కమిటీ వల్ల అగ్నికుల క్షత్రియులకు, వారి సంఘాలకు ఏవిధమైన ఇబ్బంది కలగకూడదని గొల్లపల్లి సూచించారు. టీడీపీ హయాంలో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా హార్బరును తీసుకువచ్చామని, హార్బరు మత్స్యకారులకే సొంతం కావాలని, ఏ కమిటీలు వేసినా మత్స్యకారులకే దక్కాలన్నారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, వనమాలి మూలస్వామి, మందపాటి వెంకటేశ్వరరావు, దాసరి వాసు, కౌరు శ్రీనివాస్, కొల్లు మహాలక్ష్మి, అంతర్వేదిపాలెం పుల్లయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.గంగవరం, ఫిబ్రవరి 16: శివల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం డీఈ వై.విజయానంద్ తెలిపారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5 గంటల వరకు శివల, దంగేరు, పేకేరు, భట్లపాలిక, తాళ్లపోడు, మసకపల్లి, యర్రపోతవరం, గుడిగళ్ళభాగ, బాలాంత్రం, వట్రపూడి, అద్దంపల్లి, విలాసగంగవరం, నేరేళ్ళంక గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

మోడరన్ ప్రైమరీ స్కూల్‌లో వార్షికోత్సవం

రామచంద్రపురం, ఫిబ్రవరి 16: స్థానిక ముచ్చుమిల్లిలో గల మోడరన్ ఏటీసీ ప్రైమరీస్కూల్ వార్షికోత్సవం శుక్రవారం మోడరన్ ప్రైమరీ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ ఆర్.రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలంరించాయి. ప్రైమరివిద్యార్థులు విచిత్ర వేషధారణలతో ఆకట్టుకున్నారు. మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్. జి.వి.రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసేది ఉపాధ్యాయుడు మాత్రమేనన్నారు. మోడరన్ అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.